ప్రజాశక్తి

సోమవారం 13 జనవరి 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

ఉక్కులో విఆర్ఎస్‌పై భగ్గు

భోగి మంటల్లో ప్రతుల దహనం



గాజువాకలో విఆర్ఎస్ ప్రకటన ప్రతులను భోగి మంటలో వేస్తున్న లోకనాథం తదితరులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాన్ని (విఆర్ఎస్) ముందుకుతెచ్చి కర్మాగారంలోని ఉద్యోగులను తొలగించే చర్యలను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన విశాఖ నగరంలో సంబంధిత ఆర్డర్ ప్రతులను ఆదివారం భోగి మంటల్లో వేసి దహనం చేశారు. తక్షణమే విఆర్ఎస్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి - గాజువాక : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో విఆర్ఎస్‌ను ముందుకు తేవడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం గాజువాక జగ్గు జంక్షన్‌లో భోగి మంటలో విఆర్ఎస్ ప్రకటన ప్రతులను వేసి తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న విశాఖలో జరిగిన సభలో మోడీ, చంద్రబాబు, పవన్‌లు ఉక్కు విషయంపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చూడటం అన్యాయమన్నారు. ప్లాంట్‌ను మిగతా 2లో..



మద్దిలపాలెంలో ప్రతులను భోగి మంటలో వేస్తున్న నాయకులు



పూర్ణా మార్కెట్ ఏరియాలో బట్టల దుకాణాల వద్ద కొనుగోలుదారుల తాకిడి

వస్త్ర దుకాణాలు కళకళ

- రద్దీగా జగదాంబ జంక్షన్
- డాబాగార్డెన్స్, పూర్ణా మార్కెట్ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి
- షాపింగ్ మాల్స్, మల్టీ ప్లెక్స్ కిటకిట
- పండగ నేపథ్యంలో ఆఫర్ల వెల్లువ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి షాపింగ్ సందడి తారాస్థాయికి చేరింది. వారం రోజులుగా నగరంలోని వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతూనే ఉన్నాయి. చిన్నచిన్న వస్త్ర దుకాణాల నుంచి భారీ షోరూమ్‌లు, మల్టీప్లెక్స్ స్టోర్ల వరకు అన్నీ కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది పది రోజుల పాటు సెలవులు రావడం, దూర ప్రాంతాల నుంచి బంధువులు వస్తుండటం, సకుటుంబ సమేతంగా సొంతూర్లకు వెళ్తుండటంతో అందరికీ పండగ దుస్తులు కొనేందుకు షాపులకు తరలివస్తున్నారు. జగదాంబ జంక్షన్ ఈ శని, ఆదివారాలు ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసింది. ఉమ్మడి విశాఖ జిల్లానే కాకుండా పొరుగున ఉన్న జిల్లాల నుంచి కూడా జగదాంబ జంక్షన్‌కు షాపింగ్ మిగతా 2లో..

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

▶ వార్త 4లో..

బాలికపై అత్యాచారం

▶ వార్త 4లో..

మృతురాలి కుటుంబానికి పరిహారం

▶ వార్త 2లో..

బస్సుల కొరత లేదు

- విశాఖ నుంచి దూర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు
- సంక్రాంతికి అదనంగా 350 బస్సులు వేస్తున్నాం
- ఛార్జీల పెంపులేదు
- పండగ ఆదాయ లక్ష్యం రూ.కోటి
- 'ప్రజాశక్తి'తో జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతిని పురస్కరించుకుని విశాఖపట్నం ద్వారకా బస్ స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు ఇప్పటికే 7 డిపోల పరిధిలో ఉన్న 680 బస్సులు కాకుండా మరో 350 ప్రత్యేక బస్సులను ప్రయాణికుల కోసం నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు వెల్లడించారు. ఈ ఏడాది బస్సుల కొరత, ఛార్జీల పెంపు లేదన్నారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలను ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎప్పటి నుంచి అదనపు సర్వీసులు నడుపుతున్నారు ?

పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జనవరి 9 నుంచి 13వ తేదీ వరకూ ప్రత్యేకంగా 350 బస్ సర్వీసులను విశాఖ డిబిఎస్ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలు, సుదూర ప్రాంతాలైన విజయవాడ, ఉభయ గోదావరి జిల్లాలు, హైదరాబాద్ వరకూ నడుపుతున్నాం. 13 తర్వాత రద్దీ కొంత తగ్గిపోతుంది. ఎవరి ఊళ్లకు వారు వెళ్లిపోయాక బస్ సర్వీసులు కొంత మేరకు తగ్గించేస్తాం. మరలా 16 నుంచి రిటర్న్ ట్రాఫిక్ మొదలవుతుంది. మరో నాలుగైదు రోజుల పాటు సర్వీసులు మరలా పెంచుతాం.





రాష్ట్రంలోనే అత్యధిక బస్ సర్వీసులు విశాఖ నుంచే ఎందుకు ?

విశాఖలో అత్యధిక మంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి సెటిలర్స్‌గా జీవనం సాగిస్తున్నారు. అనేక రంగాల్లో ఇక్కడకొచ్చి స్థిరపడిన వారుండడంతో పండగల సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లడం, రావడంతో ట్రాఫిక్ అధికం. పైగా రైళ్లకు సంబంధించి పాసింజర్‌లు చాలా రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల సంఖ్య అవసరం ఏర్పడింది.

ఏయే ప్రాంతాలకు ఎన్నెన్ని సర్వీసులు వెళ్తున్నాయి?

విశాఖ నుంచి హైదరాబాద్‌కు 25 ప్రత్యేక బస్సులు, విజయవాడకు 45, రాజమండ్రికి 30, అమలాపురం, కాకినాడలకు 30, అలాగే విశాఖ నుంచి విజయనగరం, పాలకొండ, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



జివిఎంసి దీక్షా శిబిరంలో నినదిస్తున్న సిఐటియు నాయకులు, డెయిరీ కార్మికులు

ఉక్కులో విఆర్‌ఎస్‌పై భగ్గు

సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించకుండా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పాటు చేస్తామంటున్న ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని సిఎం చంద్రబాబు మోడీని కోరడం శోచనీయమన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ ఉక్కుపై స్పందించకపోవడం సరికాదన్నారు. చంద్రబాబు తాను మారానని అంటున్నారు తప్ప వాస్తవానికి ఆయన ఏమీ మారలేదన్నారు. మోడీకి దాసోహమవుతూ గ్రామీణ ప్రాంతాల్లో టోల్‌గేట్లు ఏర్పాటు చేసి ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. పార్టీ గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో ఇక్కడి ప్రజలు గెలిపిస్తే ఆయన స్టీల్‌ప్లాంట్‌పై అస్సలు నోరు మెదపడం లేదన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తెరిగి ప్లాంట్ పరిరక్షణ విషయమై కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాస్, స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, నాయకులు పివైవి.రమణరావు, అప్పారావు, జి.లక్ష్మి, సరోజిని, వైటి.దాస్, నారాయణ, శ్రీనివాస్, గురప్ప, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మరోసారి ప్రధాని మోడీ ద్రోహం చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకరించి ముగ్గురు మోసగాళ్ళుగా చరిత్రలో నిలిచిపోయారని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మండిపడ్డారు. ఆ ముగ్గురి వైఖరిని ఖండిస్తూ మద్దిలపాలెం కళాభారతి రోడ్డులో సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. మూడు కోతులతో కూడిన మోడీ, బాబు, పవన్ పోస్టర్లను చేబూని ఉక్కు విఆర్‌ఎస్ ప్రకటన ప్రతులను భోగి మంటలో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ ఇటీవల విశాఖకు వచ్చిన మోడీ స్టీల్‌ప్లాంట్ కోసం ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. పైగా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కావాల్సిన ఇనుప ఖనిజాన్ని పైపులైన్ ద్వారా అందించడానికి సహకరిస్తామని చెప్పుకొచ్చారన్నారు. దానికి వెంటనే బాబు, పవన్‌లు ధన్యవాదాలు తెలియజేయడం దుర్మార్గమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయడానికే మిట్టల్ స్టీల్ వస్తోందన్నారు. ప్రస్తుతం ఉక్కు కర్మాగారంలో ఉన్న ఉద్యోగులను, కార్మికులను బలవంతంగా తొలగించేందుకు ప్లాంట్ యాజమాన్యం బహిరంగంగానే చర్యలు తీసుకుంటున్నా బాబు, పవన్‌లు ఏమాత్రం మాట్లాడటం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జోన్ నాయకులు పి.వెంకటరావు, కుమారి, కుమార్ మంగళం, త్రినాధ్, జివిఎన్.చలపతి, జివి.రమణ, అనపర్తి అప్పారావు, పీతల అప్పారావు, తులసీరామ్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను బలవంతంగా తొలగించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన విఆర్‌ఎస్‌ను తక్షణమే నిలుపుదల చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న ఉక్కు జెఎసి దీక్షా శిబిరంలో ఆదివారం విశాఖ డెయిరీ ఉద్యోగులు కూర్చున్నారు. తొలుత విఆర్‌ఎస్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.రమణ, అధ్యక్షులు కె.వరాహ మూర్తి, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, డెయిరీ నాయకులు వి.నారాయణ, డి.నాగమణి బాబు, జి.నాగేశ్వరరావు, యు.శ్రీనివాసరావు, బి.కోటేశ్వరరావు, డి.లక్ష్మి, ఎల్‌విఎం.నాయుడు, అనసూయ, ఇంద్ర, విజయ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కొరత లేదు

పార్వతీపురం, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం వరకూ సుమారు 205 బస్సులు, మచిలీపట్నంకు 2 బస్సులు నడుపుతున్నాం. విశాఖలో సిటీ బస్సులను తగ్గించాం. నగరంలో ప్రయాణాలు పండగ వేళల్లో తగ్గుముఖం పట్టడమే దీనికి కారణం.

ఆదాయాల అంచనా ఎలా ఉంది ?

గత ఏడాది సంక్రాంతి పండగ సందర్భంలో విశాఖ ఆర్టీసీ ఆదాయం రూ.70 లక్షలు కాగా ఈ ఏడాది రూ.కోటి వస్తుందని అంచనా వేస్తున్నాం.

జివిఎంసిని సందర్శించిన ట్రైనీ ఐఎఎస్‌లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని 42 మంది ట్రైనీ ఐఎఎస్ అధికారులు ఆదివారం సందర్శించారు. అక్కడి అధికారులు విశాఖ నగరంలోని జోన్లు, వార్డులు, ఇతర ఇంజినీరింగ్ పనుల టెండర్ల ప్రక్రియ, 15వ ఆర్థిక సంఘం నిధులు, అభివృద్ధి పనులు, థీం పార్కులు, జంక్షన్లు, నగరంలో విద్యుత్ ఆదాకు చేపట్టిన సోలార్ పవర్ ప్రాజెక్టు వివరాలను వారికి తెలియజేశారు.

వస్త్ర దుకాణాలు కళకళ

(మొదటి పేజీ తరువాయి..) కోసం వచ్చారు. నగరంలో మరికొన్ని చోట్ల షాపింగ్ మాల్స్ ఉన్నప్పటికీ జగదాంబ జంక్షన్‌లో ఉన్నన్ని అతిపెద్ద షాపింగ్ మాల్స్ మిగిలిన చోట్ల అంతగా లేవు. దీంతో ఇక్కడ తాకిడి పెరిగింది. జగదాంబ జంక్షన్ తర్వాత డాబా గార్డెన్స్‌లో కూడా ఆ స్థాయిలోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి. దిగువ, సామాన్య ప్రజలు నూతన వస్త్రాల కోసం పూర్ణా మార్కెట్‌ను ఆశ్రయించారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని పందుం పుల్లల సందు మార్కెట్ కొనుగోలుదారులతో కిక్కిరిసింది.

పండగ నేపథ్యంలో జగదాంబ జంక్షన్‌లోని వస్త్ర దుకాణాలు, మాల్స్ భారీగా పండగ ఆఫర్లను ప్రకటించాయి. ఎమ్‌ఆర్‌పిపై 50 నుంచి 60 శాతం మేర తగ్గింపును ప్రకటించడం, ఒకటి కొంటే ఒకటి ఫ్రీ, ఒకే రకం నాలుగు రెడీమేడ్ వస్త్రాలు కొనుగోలు చేస్తే మరింత తక్కువ ధరకు ఇవ్వడం వంటి ఆఫర్లు పెట్టి అమ్మకాలు సాగించాయి. వీటితో పాటు కొనుగోలుపై బహుమతులు అందజేస్తున్నారు. రూ.5 వేలు షాపింగ్ చేసిన వారికి వాచీలు, కుక్కర్లు, స్మార్ట్ ఫోన్లు, డైనింగ్ కిట్స్ ఇస్తున్నారు. రూ.10 వేలు మించి కొనుగోలు చేస్తే అంతకంటే విలువైన వస్తువులు ఉచితంగా ఇస్తున్నారు. ఉచిత కానుకలు మాత్రమే కాకుండా కొన్ని షాపింగ్ మాల్స్ వారు రోజువారీ డ్రాలు తీసి బహుమతులు అందిస్తున్నారు. సంక్రాంతిని దృష్టిలో ఉంచుకొని భారీ షాపింగ్ మాల్స్ వారు ముందుగానే షాపింగ్ లోపలి భాగాలను, అలాగే ప్రవేశ ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొనుగోలుదారులను ఆకర్షించడం కోసం మాల్స్ ఎదుట సాంస్కృతిక కళా ప్రదర్శనలను కొన్నిచోట్ల ఏర్పాటు చేశారు.

వస్త్ర వ్యాపారాలకు కేంద్ర బిందువు

రాష్ట్రంలో అతిపెద్ద నగరం విశాఖపట్నం. ఇక్కడ ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ రంగంలోనూ అనేక పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో లక్షలాది మంది ఉద్యోగాలు చేస్తుండడం, చుట్టుపక్కల జిల్లాల నుంచి ఉపాధి కోసం ఈ నగరానికి వచ్చి ఉండడంతో అన్ని రకాల వ్యాపారాలకు ఈ నగరం కేంద్ర బిందువుగా మారింది. అందుకే ఇక్కడ కార్పొరేట్ స్థాయి వస్త్ర వ్యాపారాలు జోరందుకున్నాయి. సిఎంఆర్, లక్కీ, ఆర్‌కె, ఎస్‌ఆర్, ఎస్‌కెఎంఎల్, కళాంజలి, కళామందిర్, మృధుల వంటి షాపింగ్ మాల్స్ చాలా కాలం నుంచి ఇక్కడ ఉన్నాయి. ఇవి కాకుండా కొత్తగా సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్, చెన్నై షాపింగ్ మాల్, ఆర్‌ఎస్ బ్రదర్స్, బుట్ట బొమ్మ వంటి కార్పొరేట్ షాపింగ్ మాల్స్ వచ్చాయి. సిఎంఆర్, లక్కీ షాపింగ్ మాల్స్ జగదాంబ జంక్షన్‌తోపాటు పలుచోట్ల బ్రాంచిలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ద్వారకా నగర్, సంపత్ వినాయక టెంపుల్ రోడ్డు, మద్దిలపాలెం, ఎంవిపి.కాలనీ వంటి ప్రాంతాలలో కూడా షాపింగ్ మాల్స్ ఉన్నాయి. అలాగే నగరానికి వెలుపల గోపాలపట్నం, గాజువాక, మధురవాడ ప్రాంతాలలో కూడా వస్త్ర వ్యాపారాల భారీ షాపింగ్ మాల్స్ కొలువుదీరాయి.

రూ.25 కోట్ల వ్యాపార లక్ష్యం

సంక్రాంతి సీజన్‌లో చిన్న, పెద్ద షాపింగ్ మాల్స్ అన్నింటిలో కలిపి వస్త్రాల కొనుగోలు వ్యాపారంపై ఈ ఏడాది రూ.25 కోట్ల మేర వ్యాపారం సాగవచ్చని వస్త్ర వ్యాపారుల సంఘం నాయకుడు ఒకరు తెలిపారు. గత ఏడాది రూ.20 వేల కోట్లు వరకు వ్యాపారం జరిగిందన్నారు.

ఈ సారి లక్ష్యాన్ని మించి వ్యాపారం జరిగే పరిస్థితి ఉందని తెలిపారు. వస్త్ర వ్యాపారాల దుకాణాలు మాత్రమే కాకుండా సంక్రాంతి పండగ నేపథ్యంలో సెల్‌ఫోన్ల విక్రయాలు, చెప్పులు, ఫ్యాన్సీ వస్తువుల విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి. దీంతో వీటిని విక్రయిస్తున్న దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.

తిరుపతి ఘటనలో..

మృతురాలి కుటుంబానికి పరిహారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టికెట్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన బాధితురాలు గుడ్ల రజిని కుటుంబ సభ్యులకు ఆదివారం ఉదయం మద్దిలపాలెంలోని ఆమె గృహంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, టిటిడి సభ్యులు ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున హోం మంత్రి రూ.25 లక్షల చెక్కు అందజేయగా, టిటిడి తరపున బోర్డు సభ్యులు రూ.2.5 లక్షల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ చనిపోయిన వారిని వెనక్కి తీసుకురాలేమని, వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు అంతేకాకుండా మృతుల కుటుంబాలలో ఒకరికి టీటీడీలో కాంట్రాక్టు ఉద్యోగం కల్పిస్తామని, వారి పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు ఇప్పటికే వివరాలు సేకరించామని అన్నారు. ఆమె వెంట టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తూర్పు శాసన సభ్యులు వెలగపూడి రామ కృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, టిటిడి సభ్యులు జ్యోతుల నెహ్రూ తదితరులు ఉన్నారు.



రజిని కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న అనిత తదితరులు

నిరుపేదలకు సంక్రాంతి సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతిని పురస్కరించుకొని 'చారిటీ బాక్స్' సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు నిత్యావసరాలు అందజేశారు. విశాఖ ఓల్డ్ సిటీ పాత పోస్టాఫీసు దగ్గర నివాసం ఉంటున్న పేదలకు, ఎంవిపి కాలనీ, పెదవాల్తేరు, తాటిచెట్లపాలెం, శివాజీపాలెం తదితర ప్రాంతాలలో ఎంపిక చేసిన నిరాశ్రయులకు నిత్యావసరాలు అందజేశారు. ఒక్కో కిట్‌లో 15 రకాల వస్తువులు, 15 కేజీల సామగ్రి ఉంది. ఈ సందర్భంగా చారిటీ బాక్స్ ప్రతినిధి పొట్నూరు వెంకట రమణ మాట్లాడుతూ తెలుగు లోగిళ్లలో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎంతో ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. పేద, ధనిక తేడా లేకుండా పండగ మూడు రోజులు అందరూ సంతోషంగా గడుపుతారని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అత్యంత దయనీయంగా జీవనం గడుపుతున్న కుటుంబాలను ఎంపిక చేసి ఈ నిత్యావసరాలు అందజేశామన్నారు. కేవలం విశాఖ నగరంలోనే కాకుండా, అనకాపల్లి జిల్లా యలమంచిలి, పాయకరావుపేట, అలాగే శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేట, చాపర, బాపట్ల జిల్లాలోని మార్టూరు ప్రాంతాల్లో కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో ఇదే రోజు వితరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. చారిటీ బాక్స్ ప్రతినిధులు తాడికొండ కరుణాకర్, కొంతం శివాజీ ప్రసాద్ మాట్లాడుతూ చారిటీ బాక్స్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు నిరుపేదల పక్షానే నిలిచిందన్నారు. కార్యక్రమంలో లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

చైతన్యం నింపిన కళాకారుల ప్రదర్శనలు



ఉత్సాహంగా మహిళా కోలాట బృంద కళాకారుల ప్రదర్శన

ప్రజాశక్తి -తగరపువలస :ఆదివారం సాయంకాల సమయాన స్థానిక జంక్షన్‌లో మహిళా కోలాట బృంద కళాకారులు, ప్రజానాట్య మండలి కళాకారులు, కొందరు ప్రజా గాయకులు ప్రదర్శించిన, ఆలపించిన పాటలు ఆద్యంతం ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగాయి. ప్రజా నాట్య మండలి, సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన 'సంక్రాంతి సంబరాలు' ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయి. 'సంక్రాంతి వచ్చింది తుమ్మెదా' అంటూ భీమిలి బ్యాంక్ కాలనీ, ఎల్లమ్మపేట గ్రామ మహిళా కోలాటం బృంద కళాకారులు ప్రదర్శించిన కోలాటం ఉత్సాహాన్ని నింపింది. ప్రముఖ జానపద గాయకులు గండ్రేటి శ్రీనివాస్ పాడిన 'శ్రమ నుంచి పుట్టింది పాట' ఆద్యంతం చైతన్యం నింపింది. భీమిలి, భోగాపురం మండలాలకు చెందిన మహిళా కోలాట బృంద కళాకారులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, కె.నాగరాణి, భాగం లక్ష్మి, ఎస్.గున్న, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రపు రమణ, ఎం.చంటి, భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా పోతురాజు, బెల్లాన రామకృష్ణ, ఉపాధ్యక్షులు దల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ముందుగా పట్టణ ప్రధాన రహదారి గుండా సభాస్థలి వరకు కళాకారులు ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు గుర్రపు రమణ



ప్రదర్శనలను తిలకిస్తున్న అతిథులు

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞానవిహార 45వ వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలలో సైన్సు, హ్యుమానిటీస్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎయు ప్రొఫెసర్ గిరిజా శంకర్ హాజరై మాట్లాడుతూ, సృజనాత్మక శక్తులతో పాటు, కష్టపడేతత్త్వం, నిజాయతీ, చిన్ననాటి నుంచే అభివృద్ధి, విలువలతో సంపూర్ణ మూర్తిమత్వం రావాలన్నారు. సతీష్ రామ్‌చౌదరి మాట్లాడుతూ, విద్యార్థులు సృజనాత్మకను మెరుగుపరుచుకోవాలన్నారు. సైన్సుకు సంబంధించి స్పాడిక్స్, త్వరితగతిన వెళ్ళే మిస్సైల్, ధ్వని వేగం కన్నా 9రెట్లు వేగంతో దూసుకెళ్లే క్షిపణి, మానవరహిత డ్రోన్, ఎంక్యూ, జీవశాస్త్రానికి సెన్సార్ సిస్టం ద్వారా నీటి వినియోగం, జీవరాశులు ప్లాస్టిక్‌ను ఆరిగించుకోగల ఎంజైమ్స్ సామర్థ్యం, కుటుంబజీవనానికి, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఇంటి భోజనం రకాలు, స్వయం కళాకృతులు తదితర సుమారు 40 నమూనాలు ప్రదర్శించారు.

సమాజ ప్రగతిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయం



డైరీని ఆవిష్కరిస్తున్న ఫణిరామ్ తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : సమాజ ప్రగతిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయమని జివిఎంసి జోన్-2 ఇన్‌ఛార్జి కమిషనర్ ఫణిరామ్ కొనియాడారు. మధురవాడలోని మా మీడియా హబ్‌లో ఆదివారం స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర -2025 డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విపత్కర సమయాల్లో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సమాజ స్థితిగతులపై ప్రజలను చైతన్య పరుస్తున్నది జర్నలిస్టులే అని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అద్వితీయమని ప్రశంసించారు. భవిష్యత్తులో అసోసియేషన్ చేయబోయే కార్యక్రమాలకు తమ సహకారం అందిస్తామని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ మాట్లాడుతూ, 2016వ సంవత్సరం నుంచి జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా తమ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. సీనియర్ పాత్రికేయులు పిళ్లా విజయకుమార్, సాంబశివరావు, నాగోతి నరసింహనాయుడు, ఆనంద్, రామునాయుడు తదితరులు మాట్లాడారు. అనంతరం ఫణిరామ్ చేతుల మీదుగా జర్నలిస్టులకు డైరీలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారులు కర్రి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలు బాలు పాత్రో, కొండ్రి వినోద్, సీనియర్ పాత్రికేయులు విజయ్ కుమార్, నేమాల అనేష్‌కుమార్, రాణాప్రతాప్, కె.అభిరామ్, మొజ్జాడ శ్రీను, మానం శ్రీనివాస్, రాము, శ్రీనివాస్, బాపూజీ, హరినాథ్, అబ్బిరెడ్డి చంద్రశేఖర్, సురేష్‌కుమార్, బాబూరావు, సాయి, సత్యం, సంతోష్, కుమార్, రమణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడిలోవ విజ్ఞాన విహార్ వార్షికోత్సవం




సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార్ 45వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హాజరయ్యారు. విద్యాభారతి అధ్యక్షులు పివి.నారాయణరావు అధ్యక్షతన జరిగిన సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యతో పాటు, నైతిక విలువలను పెంపొందించేందుకు విజ్ఞాన విహార్‌ను ప్రారంభించారని తెలిపారు. అనేక విద్యా సంస్థలు కేవలం మార్కుల కోసమే విద్యార్థులను తయారు చేస్తుండగా విజ్ఞాన విహార్ అందుకు భిన్నంగా ధైర్యసాహసాలు నింపే ఒక ప్రత్యేక శిక్షణను ఇక్కడ అందిస్తున్నట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఎన్ఎస్‌టిఎల్ అసోసియేట్ డైరెక్టర్ జివి.కృష్ణకుమార్, ప్రొఫెసర్ గంగప్రసాద్ ప్రసైన్, ప్రిన్సిపల్ జి.రామకృష్ణ తదితరులు మాట్లాడారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న విన్యాసాలు

సాహసమే ఊపిరిగా విజ్ఞాన విహార్ విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు గగుర్పాటు కలిగించాయి. బాలురు, బాలికలు మోటార్ బైక్ ఫీట్స్‌తో అలరించారు. 40 నిమిషాల పాటు 66 క్రీడా విన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో దూసి రామకృష్ణారావు, పివి.నారాయణరావు, జి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, విశ్వనాథరాజు పాల్గొన్నారు.



విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నేరాలు ఘోరాలు

కోడి పందేల శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆరిలోవ : సంక్రాంతి నేపథ్యంలో తోటగరువు, బిటిఆర్.నగర్‌లో కోడి పందేలు ఆడుతున్న శిబిరాలపై పోలీసులు ఆదివారం దాడిచేశారు. కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కోడి పుంజులను, రూ.1500 స్వాధీనం చేసుకున్నారు. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 పందెం కోళ్లు స్వాధీనం

గాజువాక : జివిఎంసి 70వ వార్డు పరిధి ఎల్‌బి.నగర్‌లో కోడి పందేలకు సిద్దమౌతున్న ఇద్దరిని గాజువాక సిఐ పార్థసారథి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 పందెం కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. గాజువాక పరిధిలో కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : మండలంలోని మూలకుద్దు గ్రామంలో ఉప్పుటేరు పక్కన బహిరంగ ప్రదేశంలో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న 8 మందిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు.కోడి పందాలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. వారి నుంచి కత్తులు కట్టి ఉన్న 6 కోళ్లు, రూ.12,600 స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సిఐ సుధాకర్, ఎస్ఐ జి.హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని అనంతవరం గ్రామంలో సారిక పైడిరాజు ఇంటి వెనుక ఖాళీ ప్రదేశంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3700, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పద్మనాభం సీఐ శ్రీధర్ తెలిపారు.

ఆనందపురం : ఆనందపురం పంచాయతీ పరిధిలో విల్లాస్ ఎదురుగా ఉన్న బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.9 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సిహెచ్ వాసునాయుడు, ఎస్ఐ సంతోష్ తెలిపారు.

ట్రావెల్ బస్సు ఢీకొని చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ నుంచే విజయవాడకు వెళుతున్న ట్రావెల్ బస్సు పాత గాజుల జంక్షన్‌లో ఒక ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఆ సమయంలో బండిపై ఉన్న చిన్న పాపకు స్వల్ప గాయమైంది. అదే సమయంలో గాజువాక మీదుగా వెళుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత కాన్వాయ్ ఆపి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి - ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- ఎస్.రాయవరం :మండలంలో రెండు బైక్ లు ఢీ కొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా, ముగ్గురు యువకులు తీవ్రగాయాల పాలయినట్లు స్థానిక ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఆదివారం ఆయన ఇచ్చిన సమాచారం మేరకు.. శనివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో అడ్డురోడ్డు నుండి రేవుపోలవరానికి యువకులు బైక్‌పై వెళుతున్నారు. కొరుప్రోలు పీచు పరిశ్రమ వద్దకు వచ్చేసరికి బైక్‌లు ఢీ కున్నాయన్నారు. ఈ ఘటనలో కొత్తరేవుపోలవరం గ్రామానికి చెందిన పల్లేటి జగదీష్ (20) ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. హర్షిత్ కుమార్, ఎరిపల్లి వాసు తీవ్ర గాయాలపాలయ్యారు. మరొక యువకుడు ఇశ్రాయెల్ స్వల్ప గాయాలతో బయట పడినట్లు తెలిపారు. క్షతగాత్రులను 108లో నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో హర్షిత్ కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ లో ప్రయివేటు ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టమ్ అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. మతుడు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

25 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని పేరంటాల పాలెం గ్రామానికి చెందిన గోనె సంచెలో అక్రమంగా నిల్వ ఉంచిన 25మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు తనిఖీ చేయగా, పువ్వుల ప్రసాదరావు వద్ద మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం : ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి -గాజువాక : సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాత గాజువాక లంకా మైదానంలో మూడు రోజుల పాటు కీర్తిశేషులు మణి యాదవ్ మెమోరియల్ పేరిట వింద్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో వేమన ఐటిఐ ప్రథమ స్థానంలో, దేవాడ ద్వితీయ స్థానంలో, కివిస్ జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల విజేతలకు ఎమ్మెల్యే ద్వారా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సామాజిక సేవే ధ్యేయంగా మణియాదవ్ పనిచేసి అందరి హృదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచారని కొనియాడారు. అతని ఆశయాలను పాటిస్తూ ఏటా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, ఎఆర్ కనస్ట్రక్షన్స్ ప్రతినిధి రాజు, 70వ వార్డు ఇన్‌ఛార్జి చట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి -గాజువాక : యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఉందని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్ అన్నారు. గాజువాక చైతన్యనగర్‌లో ఆదివారం ఎఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సిపిఐ, ఎఐవైఎఫ్ ప్రతినిధులతో కలిసి స్టాలిన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర మహాసభ జరగనుందని, విజయవంతానికి ప్రజలు, విద్యార్థులు, యువత సహకరించాలని కోరారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.అచ్యుతరావు మాట్లాడుతూ, యువతకు ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, పి.దుర్గారావు, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.శివమూర్ పాల్గొన్నారు.

జోరుగా గాలిపటాల విక్రయాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సంక్రాంతి అంటే పిల్లలు కేరింతలతో ఎగురువేసే గాలిపటాలు గుర్తుకొస్తాయి. పండుగ సెలవుల్లో పిల్లలు ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేస్తుంటారు. గాలిపటాలు ఎలా ఎగురవేయాలో పిల్లలకు నేర్పుతూ తల్లిదండ్రులు కూడా సరదాగా గడుపుతుంటారు. శంకరమఠం రోడ్డులోని పాల్పుక్ సెంటర్, సంఘం ఆఫీస్ కూడలిలో రంగురంగుల్లో వివిధ రూపాల్లో ఉన్న గాలిపటాలను జోరుగా విక్రయిస్తున్నారు. పిల్లలు, పెద్దలు వచ్చి ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు. క్లాత్‌తో తయారుచేసిన మూడు రకాల గాలిపటాల విక్రయిస్తున్నారు. బటర్‌ఫ్లై, షార్క్ చేప, గుడ్లగూబ, గబ్బిలం, గ్రద్ద ఆకారాలతో తయారుచేసిన గాలిపటాలు పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. బాహుబలి, చోటా భీమ్, టాటా జెర్రీ, స్పైడర్‌మాన్, డోర్ మాన్ సినీ తారల ముఖచిత్రాలతో పేపర్ పాలిథిన్‌తో తయారు చేసిన గాలిపటాలను కూడా విక్రయిస్తున్నారు. రూ.10 నుంచి రూ.300 విలువైన గాలిపటాలు అందుబాటులో ఉన్నాయి గాలిపటం ఎగరవేయడానికి మాంజేను రూ.50 నుంచి రూ.300 ధరలో వ్యాపారులు విక్రయిస్తున్నారు.



విక్రయాలు చేస్తున్న గాలిపటాలు

బాలికపై అత్యాచారం

నిందితుడు కూడా మైనరే

ప్రజాశక్తి - ఎలమంచిలి : మండలంలోని ఏటికొప్పాకలో ఐదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలుడు అత్యాచారం చేసినట్లు, బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎలమంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శనివారం సాయంత్రం 4.30 గంటలకు సంఘటన జరగ్గా, ఆదివారం 11 పోలీసులకు ఫిర్యాదు అందింది. పరవాడ డిఎస్‌పి సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

నిందితుడిపై ఫోక్సో కేసు పెట్టాలి

బాలికపై అత్యాచార ఘటన జుగుప్సాకరమని, బాధ్యుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.శివాజీ డిమాండ్ చేశారు. నిందితునిపై ఫోక్సో కేసు నమోదు చేసి చట్టప్రకారం ఫాస్ట్ ట్రాక్‌కోర్టు ద్వారా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమాజంలో ఇటువంటి నేరాలు అధికమౌతున్నాయని, వీటికి ఫోర్న్ వీడియోస్, మత్తు పదార్థాలకు బానిసలు కావడం వంటికి కారణమని, వీటి అదుపునకు చర్యలు చేపట్టాలని కోరారు.

యల్లాప్రగడకు గీతం నివాళి

ప్రజాశక్తి -మధురవాడ : ఔషధ రంగంలో భారతదేశం గర్వించదగ్గ పరిశోధనలు చేసి ప్రజల జీవితాలను కాపాడే మందులను కనుగొన్న డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు చిరస్మరణీయుడని గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్ పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యాన ఆదివారం డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతిని నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆవరణలోని డాక్టర్ సుబ్బారావు విగ్రహానికి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫార్మసీ డీన్ మాట్లాడుతూ, భారతదేశ ఔషధరంగం నుంచి ప్రాణాంతక వ్యాధులకు మందులను కనుగొనాల్సిన అవసరం ఉందని, దీనికి విశ్వవిద్యాలయాలకు పరిశ్రమలకు మధ్య సంబంధాలు దోహదపడతాయని తెలిపారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ రానున్న రోజులలో దేశం గర్వించదగ్గ పరిశోధనలను అందించాలని సూచించారు. గీతం ఫార్మసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్, ఫార్మసీ సీనియర్ ప్రొఫెసర్లు మాట్లాడుతూ, ఫార్మస్యూటికల్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

పందేలపై డ్రోన్లతో నిఘా

ప్రజాశక్తి-ఆనందపురం : సంక్రాంతి నేపథ్యంలో మండలంలో కోడిపందేలు, పేకాటలు జరిగే అవకాశమున్నందున పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఆనందపురం మండలంలోని దుక్కవానిపాలెం, గోరింటపల్లిపేట కొండ పరివారక ప్రాంతాల్లో డ్రోన్లను ఎగరవేసినట్లు ఆనందపురం సిఐ వాసునాయుడు తెలిపారు. పేకాట, కోడిపందేల శిబిరాలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిఐ హెచ్చరించారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ప్రజాశక్తి-యంత్రాంగం

స్వామి వివేకానంద జయంతిని ఆదివారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు.

భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజుపేట ఎంపియుపి పాఠశాలలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన భీమిలిలో నిర్వహించిన జయంతిలో మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూక రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాజువాక : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పెదగంట్యాడ గ్రంథాలయంలో విద్యార్థులచే చదవటం మాకిష్టం అన్న నినాదంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.వి.రమణ, పాఠకులు పురుషోత్తం, రాంబాబు, రాకేష్, సాగర్, ప్రసాద్, యుగంధర్, రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మధురవాడ : పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు నాయుడు, అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్, జగన్మోహన్‌చౌదరి, శ్రీపాద వెంకటరణ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పద్మనాభం, ఇసుకలపాలెం గ్రామాల్లో, గోస్తనీ స్కూల్లో వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోస్తనీ స్కూల్ కరస్పాండెంట్ కాళ్ళ సూరిబాబు, విశ్రాంత ఉపాధ్యాయులు బోని సన్యాసినాయుడు, నిర్వాహకులు రూపాకుల రవికుమార్, గ్రామాల పెద్దలు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పాలూరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, రచయిత కె.సత్తిరాజు, వై.అనసూయా దేవి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గాజువాక డిపో నుంచి మల్కాపురం వరకు యూత్ 5 కె రన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గణబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పివిఎన్.మాధవ్, కాశీ విశ్వనాథరాజు, సురేంద్రమోహన్, గాజువాక ఎసిపి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని గొల్లవీధిలో స్వామి వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువతకు జాతీయ యువజన దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, బోడి వెంకటరావు, సాయి, కర్రి శ్రీనివాసరావు, దూలం గోపి, సందిన సునీల్, తిమ్మ పత్రుని చక్రవర్తి, తలారి ప్రసాద్, కొట్ని రామకృష్ణ, రాంబాబు, దాడి బుజ్జి, మంగ ఈశ్వర్, పాల్గొన్నారు.



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల

తుమ్మపాల మెయిన్ రోడ్డులో వివేకానంద విగ్రహానికి ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తాతు నాయుడు, సీతారాం విశ్వేశ్వరరావు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్లో అంబేద్కర్ విగ్రహం వద్ద స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ గోళం బుసిరాజు, సభ్యులు కాండ్రేగుల సర్వేశ్వరరావు, దొడ్డి రమేష్ కనిశెట్టి సురేష్ బాబు, బండి అప్పారావు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలో ఆర్ఇసిఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీను ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు

కె. కోటపాడు : మండలంలోని గొండుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 22 గ్రూపులుగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కె.కోటపాడు వేణు విద్యా నికేతన్ విద్యార్థులు ప్రథమ ద్వితీయ బహుమతులను చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. సమాజ మిత్రమండలి ఆధ్వర్యంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు బండారు వెంకటరమణమూర్తి, బండారు రామ లక్ష్మణ్ ఉపాధ్యాయులు వంటాకు ప్రసాదు బొజ్జ అర్జున్, పీలా శ్రావణ్ చిటిమిరెడ్డి గంగాభవాని పాల్గొన్నారు

రావికమతం:స్వామి వివేకానంద జయంతి వేడుకలను పురస్కరించుకొని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ మేలుకొలుపు, సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పి పొన్నవోలు పంచాయతీ శివారు ఆర్ కొత్తూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి భజన బృందాలు తరలి వచ్చారు.ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాసు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : పట్టణంలో వివేకానంద విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్త వీధి నుండి పెద్ద బొడ్డేపల్లి రోడ్డు మార్గంలో వివేకానంద విగ్రహం వద్ద జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, బుల్లిదొర మాట్లాడుతూ, స్వామి వివేకానంద యువతకు మార్గదర్శి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెట్ల నాయుడు, విజయ్, నాయకులు పాల్గొన్నారు.

రోలుగుంట:యువత స్వామి వివేకానందను స్ఫూర్తిని తీసుకుని ముందుకు సాగాలని బీజేపీ మండల అధ్యక్షుడు పచ్చిగోళ్ళ ఈశ్వరరావు అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షులు చావ్వాకుల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వివేకానంద బోధనలతో క్రమశిక్షణతో కూడిన జీవితం అలవడుతుందని బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొక్క వీధి ఫిషింగ్ హార్బర్ బీచ్ రోడ్డులోగల సంస్థ కార్యాలయంలో వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి సహకారంతో నడుస్తున్న బ్రిడ్జి స్కూల్లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాట్ల బాబూరావు రెడ్డి, డాక్టర్ బాబ్జి, లక్ష్మీ నందిని పాల్గొన్నారు. బాలలు దేశభక్తి గీతాలు ఆలపించారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాల్సిందే!

● సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన నిరసన ● పలుచోట్ల కరెంట్ బిల్లుల దహనం



పరవాడలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి- పరవాడ : పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా మండల కేంద్రమైన పరవాడలో సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, విపక్షంలో ఉన్నపుడు విద్యుత్ ఛార్జీలకు పెంపును నిరసిస్తూ బాదుడేబాదుడు అంటూ ఆందోళన చేపట్టిన టిడిపి, కూటమి నేతలు, అధికారంలోకి వస్తే ఛార్జీలు పెంచబోమని హామీనిచ్చి, మాట తప్పారని మండిపడ్డారు. ఎప్పుడో వాడిన కరెంటుకు ఇప్పుడు ట్రూ అఫ్ ఛార్జీలు అంటూ ప్రజలపైనా రూ. 18 వేల కోట్లు భారం వేయడం దుర్మార్గమన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని నినాదం ఇస్తూ ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేకతను తెలియజేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. నిరసనలో సిఐటియు నాయకులు గేదెల అప్పారావు, నలమారి గురునాధరావు, పి అప్పారావు, శ్రీను పాల్గొన్నారు

దేవరాపల్లి : పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా, తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలో 50 అడుగుల నమూనా విద్యుత్తు బిల్లును ఊరేగించి, నాలుగు రోడ్ల జంక్షన్లో దహనం చేసారు, పెంచిన విద్యుత్ సర్ చార్జీలు, ట్రూఅఫ్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే ఉపసంహరించుకోవాలని, అధిక ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర మాట్లాడుతూ, విద్యుత్ ఛార్జీలు పెంచి, ప్రజలపై భారం వేసి ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఒకవైపు ప్రజలకు వ్యతిరేకిస్తుంటే, మరోవైపు దొడ్డిదారిన స్మార్ట్‌మీటర్లు బిగించడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్ల బిగిస్తే పగలుగొట్టాలని నారాలోకేష్ పిలుపు నిచ్చారని గుర్తుచేశారు. మొదటి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లంటూ స్మార్ట్‌మీటర్ల బిగింపును చేపట్టి, ఇపుడు గృహకనెక్షన్లకు విస్తరిస్తున్నారన్నారు పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపాలని నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేసారు.



దేవరాపల్లిలో నమూనా కరెంట్ బిల్లు దహనం చేస్తున్న సిపిఎం నేతలు


లా వర్సిటీని సందర్శించిన సుప్రీం న్యాయమూర్తి



విద్యార్థులతో మాట్లాడుతున్న జస్టిస్ నరసింహ

ప్రజాశక్తి.- సబ్బవరం : స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి పిఎస్. నరసింహ ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీలోని అన్ని విభాగాలను, గ్రంథాలయాన్ని సందర్శించి పరిశీలించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు అధ్యక్షతన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగపీఠికలోని 'మనకోసం మనం రూపొందించుకున్న రాజ్యాంగం" అంశం మీద విద్యార్థులను వివరించారు. "మనం" అనే దానిని నిర్వచనమిస్తూ, బ్రిటిష్ దాస్య శృంఖలాల నుంచి స్వతంత్ర్యం తెచ్చుకుని మన దేశం, మన నేల, మన వాతావరణం, మన భాష అనేవి ఎలా ఉండాలో మనం నిర్ణయించుకున్నామని తెలిపారు. విద్యార్థులంతా తాము చదువుతున్న విద్యాలయానికి పేరు తేవాలని సూచించారు. వర్సిటీలో చేరిన విద్యార్థులు తెలుగేతర భాషలకు చెందిన వారైనప్పటికీ, ఐదేళ్ల ఇక్కడే ఉండి విద్యనభ్యసిస్తున్న నేపథ్యంలో తెలుగు భాష కూడా నేర్చుకోవాలని సూచించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్, చీఫ్ వార్డెన్ భాగ్యలక్ష్మి, జోగి నాయుడు విద్యార్థులు పాల్గొన్నారు.

తండ్రి విగ్రహం ఆవిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాజేశ్వరరావు, తదితరులు

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన శరగడం తారక వెంకట రాజేశ్వరరావు మరణించిన తన తండ్రి విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డిఎల్డిఓగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరరావు తన తండ్రి ఎస్వి రమణ మృతిచెందగా, ఆయన గుర్తుగా గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటుచేసి, ఆదివారం గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు.

గ్రామసర్పంచ్‌గా వ్యవహరించిన తన తండ్రి ఎస్వి రమణ గ్రామంలో పలువురికి ఆదర్శంగా నిలిచి మంచి పేరు తెచ్చుకున్నారని, ఆయన జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఏర్పాటు చేశానని రాజేశ్వరరావు తెలిపారు. విగ్రహావిష్కరణలో ఎపి గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, గ్రామ పెద్దలు సరగడం జగన్నాథరావు, భీమిశెట్టి ఉమా శంకర్, రామస్వామి, ఆడారి నాగేశ్వరరావు, బివి రమణ , ఆడారి సూరిబాబు పాపారావు ఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

ప్రజాశక్తి- కె. కోటపాడు: యువత ఆటలపై దృష్టి పెట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మేజర్ పంచాయతీ చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు అన్నారు. . మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఐదు టీములు, వారం రోజులపాటుసాగే సిపిఎల్ క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు.

తనతోపాటు గ్రామానికి చెందిన ఏటుకూరి అప్పలరాజు, దొగ్గ అచ్చింనాయుడు సుందరపు గంగాధర్ మొల్లి గోవింద టోర్నీ నిర్వహణకు ఆర్థిక సహాయం అందించారన్నారు. చౌడువాడ గ్రామస్తుల సహాయ సహకారాలతో ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఎరుకు నాయుడు తెలిపారు. విజేతలకు ముగింపు రోజు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు

విద్యార్థి వైద్య ఖర్చులకు చేయూత

అండగా నిలిచిన తోటి స్నేహితులు, స్నేహాంజలి సంస్థ



బాధిత విద్యార్థికి సాయం అందిస్తున్న స్నేహాంజలి ప్రతినిధులు

ప్రజాశక్తి - వడ్డాది : అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో డిప్లొమో చదువుతున్న వడ్డాది గ్రామానికి చెందిన అల్లక నూకరాజు, లక్ష్మీ కుమారి దంపతుల కుమారుడు జగన్నాథానికి బ్రెయిన్ ట్యూమర్‌గా కెజిహెచ్ వైద్యులు నిర్ధారించారు. అతనికి తక్షణమే ఆపరేషన్ చేయాలని సూచించారు. అయితే కొన్ని వైద్యపరీక్షలు అవసరం కాగా, వారి స్తోమతకు మించిన ఖర్చులు కావడంతో ఏం చేయాలో పాలుపోక దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ నిరుపేద కుటుంబానికి జగన్నాథం మిత్రులతోపాటు స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ అండగా నిలిచింది. తోటి మిత్రుని వైద్యానికి అతని స్నేహితులంతా రూ.1.05లక్షల సాయం అందించగా, సమాజంలో సేవా దృక్పధం పెంపొందించాలన్న చిరు ఆశయంతో ముందుకు సాగుతున్న స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ రూ.15వేలు ఆర్థికసాయం చేసింది. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న జగన్నాధంను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో స్నేహాంజలి ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు నేతల భోగేష్, సభ్యులు దొండ రమేష్, నేతల మాధవి, సారోన్, వంశీ, అలాగే జగన్నాధం మిత్రులు పాల్గొన్నారు

తొక్కిసలాట బాధితులకు పరిహారం



గాయపడ్డ హిమబిందుకు పరిహారం అందజేస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : తిరుపతిలో తొక్కిసలాటలో గాయపడిన అనకాపల్లి పట్టణానికి చెందిన యల్లపు హిమబిందు, ఆకుల యశ్వంత్, పరవాడకు చెందిన ఉయ్యూరు మాధవిలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల చొప్పున ఆర్థికసాయం చెక్కులను ఆదివారం కూటమి నేతలు అందజేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఏపి రాష్ట్ర ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టిటిడి బోర్డు డైరెక్టర్లు జ్యోతుల నెహ్రూ, ఎమ్మెస్ రాజు, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావుతో కలిసి బాధితులకు,వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బాలికల సాధికారతకు జిఇఎం వింటర్ వర్క్‌షాప్

ఎన్‌టిపిసి సౌజన్యంతో నిర్వహణ

ప్రజాశక్తి - పరవాడ: ఎన్‌టిపిసి సింహాద్రి, దీపిక లేడీస్ క్లబ్ సహకారంతో బాలభారతి పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజుల జిఇఎం వింటర్ వర్క్‌షాప్‌ను ఆదివారం నిర్వహించారు. 13 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 110 మంది బాలికలు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో పర్సనాలిటీ డెవలప్‌మెంట్, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వం, స్థితిస్థాపకతపై తదితర ఆకర్షణీయమైన అంశాలపై సెషన్లు ఉన్నాయి. బాలికల సామర్థ్యాన్ని పెంపొందించేలా ప్రేరేపించారు. దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షులు నీతా శర్మ మాట్లాడారు. పాల్గొన్న వారందరికీ స్టేషనరీ కిట్లు, యోగా మ్యాట్లను పంపిణీ చేశారు. సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సమీర్ శర్మ మాట్లాడుతూ, అమ్మాయిల ఆకాంక్షలు, సామర్థ్యాలను ప్రోత్సహించేలా స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు.



బాలికలకు కిట్లు అందజేస్తున్న నిర్వాహకులు

50 మంది యువకుల రక్త దానం

ప్రజాశక్తి - కశింకోట : ద్వారపురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో కశింకోటలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ రక్తదాన శిబిరంలో 50 మంది దాతలు స్వచ్ఛందంగా పాల్గొని పాల్గొని రక్తమిచ్చారు. స్వామి వివేకానంద జయంతోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జివిఎస్ కొండబాబు, బొడ్డేడ నాగేశ్వరరావు, అప్పికొండ అప్పారావు, ఎంపిటిసి నడిపల్లి సన్యాసిరావు, పైల రాజు, గొంతిన రమణాజీ, ప్రగడ నూకరాజు, శిష్ట్ల అప్పారావు, గుమ్మాల శ్రీనివాసబాబు, జనపరెడ్డి హరనాథ్, ద్వారపురెడ్డి రాంబాబు, డి నూకేశ్వరరావు పాల్గొన్నారు

తపాలా పథకాలపై విస్తృత ప్రచారం



పథకాలపై ప్రచారం చేస్తున్న డిపిఐ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తపాలా పథకాలపై గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం నిదానందొడ్డి డివిజన్ కార్యాలయ ఆవరణలో తపాలా ఉద్యోగులను సత్కరించారు. ఆశించిన రీతిలో మెరుగైన ఫలితాలు సాధించిన ఉద్యోగులను జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వ్యాపారాభివృద్ధి అధికారి పలసరావు, డిపిఎం జగ్గుబాబు, చిరంజీవి పాల్గొన్నారు.

భోగలింగం నాయుడు సేవలు ఎనలేనివి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎఎంఎఎల్ కాలేజీ వ్యవస్థాపక సభ్యునిగా, గౌరీ సేవా సంఘం వ్యవస్థాపక సభ్యునిగా అనకాపల్లి పట్టణానికి, ఈ ప్రాంత ప్రజలకు గవరపాలేనికి చెందిన దాడి భోగలింగం నాయుడు ఎనలేని సేవలు అందించారని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం దాడి భోగలింగం నాయుడు విగ్రహ పున్రప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ఫూర్తినింపే పెద్దల జీవితాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. భోగలింగంనాయుడు చేసిన సేవల్ని ఈ ప్రాంతంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఆయన పేరిట భోగి రోజున తీర్థం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పాల్గొన్నారు.

నేడు నూకాంబిక తీర్థం


ఎమ్మెల్యే సుందరపును ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ

ప్రజాశక్తి - ఎలమంచిలి : మండలంలోని జంపపాలెంలో నూకాంబికా అమ్మవారి తీర్థం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, ఉత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి గుర్రం పందెం పోటీల నిర్వహిస్తుండగా, ఇప్పటికే పదుల సంఖ్యలో గర్రాలు గ్రామానికి చేరుకున్నాయి. పందెంలో విజేత గుర్రం రౌతుకు రూ.పదివేలు, ద్వితీయ తృతీయస్థానంలో నిలిచిన వాటికి రూ. రూ.8 వేలు, రూ.6వేలు, 4వ బహుమతిగా రూ.4 వేలు, 5వ బహుమతిగా రూ.2వేలుగా బహుమతి ఇస్తామన్నారు. నూకాంబిక తీర్థం సందర్భంగా సోమవారం అన్నసమారాధన ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

తోడపెద్దుల భజన, మహిళల కోలాటాలు, తప్పెటగుళ్ళ సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ౧. సాయంత్రం డాన్సబేబీ కార్యక్రమాలతో పాటు పలు గ్రామీణ నృత్యరీతులు ప్రదర్శన వంటి వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉత్సవానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కూటమి నేతలు ప్రగడ నాగేశ్వరరావులను ప్రత్యేకంగా వారి ఇంటికి వెళ్లి ఆహ్వానించినట్లు తెలిపారు.

సత్యదేవుని సన్నిధిలో రాంకీ

ప్రజాశక్తి -అనకాపల్లి : సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి, సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి కమిటీ ఆహ్వానం మేరకు అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ ఆదివారం హాజరయ్యారు. ఆలయ ఛైర్మన్ బొడ్డేడ మురళి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శాలువాతో షీల్డ్‌తో రాంకీని సత్కరించారు. కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు పెంటకోట చంద్రరావు, సూరిశెట్టి మల్లమ్మ, శ్రీకాకుళం గణపతి, ప్రధాన అర్చకులు విద్యాసాగర్, బుద్ద మురళి, తాతారావు, దేవస్థానం సిబ్బంది అనపర్తి శంకరరావు పాల్గొన్నారు.

అధిక టిక్కెట్ ధరలు వసూలు చేస్తే చర్యలు

ప్రయివేటు ట్రావెల్ బస్సులపై రవాణాశాఖ విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల నుండి అధిక టికెట్ ధరలువసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి జిల్లా రవాణాధికారి జి. మనోహర్ తెలిపారు. నిబంధనలను అతిక్రమించి, దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికుల నుంచి అత్యధిక ఛార్జీలు వసూలు చేసి, ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్న బస్సులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఆరు బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 10 నుంచి చేపడుతున్న తనిఖీలలో 80కి పైగా బస్సులపై కేసులు నమోదు చేసి రూ.14 లక్షల జరిమానా విధించినట్లు చెప్పారు. అలాగే టాక్స్ బకాయిలు చెల్లించకుండా పర్మిట్ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పండుగ తరువాత కూడా జనవరి 20వ తేదీ వరకు ప్రత్యేక బృందాలు తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.


తనిఖీలు చేస్తున్న రవాణాశాఖ అధికారులు

మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి- సబ్బవరం :గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. ఆదివారం మండలంలోని తవ్వవానిపాలెం, ఎల్లుప్పి, బోదువలస గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తవ్వవానిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పలు గ్రామాల్లో మినీగోకులం షెడ్లు ప్రారంభించారు. సిసి రోడ్లకు శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనపై ప్రత్యేక దృష్టిసారించామని, దీనికోసం ఇప్పటికే కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. సబ్బవరం మండలం తవ్వనిపాలెం గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానని, ఇప్పటికే గ్రామంలో పలు అభివృద్ధి చేపట్టానన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోకం స్వామినాయుడు ఎమ్మెల్యే సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు, కూటమి నేతలు బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల వెంకట రమణ, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి ముత్యాలు నాయుడు, దొడ్డి సూర్య ప్రకాశరావు, బోకం అర్జునుడు, బాలకృష్ణ, శ్రీరామమూర్తి, ఆకుల గణేష్, గొర్లి రామునాయుడు, తహశీల్దార్ బి. చిన్నికృష్ణ, ఎంపిడిఒ పి. పద్మజ, ఎఒ పోతల సత్యనారాయణ పాల్గొన్నారు

14, 15న ఫోర్ బౌండ్రీ కప్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణానికి చెందిన సామాజికవేత్త కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో ఫోర్ బౌండరీ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఈనెల 14.15 తేదీల్లో గవరపాలెం చిన్న హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆడారి సతీష్, కొణతాల శ్రీను తెలిపారు. ఆదివారం టోర్నీ కరపత్రాన్ని సీఐ కాంగ్రెస్‌ల వెంకట సురేష్ ఆవిష్కరించారు. ఈ టోర్నమెంట్ కు ప్రోత్సాహకులుగా కాంగ్రెస్‌ల జగన్ రాజా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పరి మాట్లాడుతూ మొత్తం 16 టీములు టోర్నీలో పాల్గొంటారన్నారు. 20 ఏళ్ల దాటిన యువత మాత్రమే పోటీల్లో పాల్గొనాలని, ఈనెల 13న మ్యాచ్‌ల షెడ్యూల్ డ్రా తీస్తామన్నారు. విజేతలతోపాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన బౌలర్, బ్యాట్స్‌మెన్, ఫీల్డర్లకు, మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ ప్రోత్సాహకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విల్లూరి సంతోష్, కొసరాజు. ఎస్. కార్తీక్,పి.దుర్గ ప్రసాద్ కె.చంద్ర శేఖర్, సోను,సందీపు, దాడి లోకేష్ పాల్గొన్నారు.


..క్రికెట్ టోర్నీ కరపత్రం ఆవిష్కరిస్తున్న సిఐ

18న వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక వేల్పుల వీధి సీతారామ కల్యాణ మండపంలో ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 171ఏళ్ల ఘన చరిత్ర ఉన్న వేల్పుల వీధి ఉత్సవాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్, రాష్ట్ర ఫైనాన్స్ అండ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గోవింద సత్యనారాయణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, గవర కార్పొరేషన్ ఛైర్మన్ సురేంద్ర తదితరులు హాజరై ప్రారంభిస్తారన్నారు. అమ్మవారి సారె ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

గౌరీ పరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అశోక్ ఈవెంట్స్, గేమ్ చేంజర్, ఒజి డాన్స్ షో, వస్తున్నాం డాన్సింగ్ నైట్, పవర్ నైట్ డాన్స్ షో, డాన్స్ ఎక్స్‌ట్రీమ్, డూప్స్ బాబోయ్ డూప్స్, బొబ్బిలి యుద్ధం, బాలనాగమ్మ బుర్రకథ, రేలారే రేలా, ఆలాపన ఆర్కెస్ట్రా, రేణుక ఎల్లమ్మ తల్లి డాన్సులు, విశాఖపట్నం వారిచే పులి వేషాలు, తాడేపల్లిగూడెం కేరళ డాన్స్, కాంతారా, మామిడివానిపాలెం లచ్చన్న పాలెంకోలాటాలు, రాజమండ్రి పొడుగు కాళ్ళ మనుషుల డాన్స్, విశాఖ జాలారిపేట దాండియా డాన్స్, ఆర్ శివరామపురం తప్పెటగుళ్ళు, విజయనగరం చింపాంజీ కథాకళి జిరాఫీ బొమ్మల డాన్సులతో పాటు దేశంలోనే పేరుగాంచిన మంచు గుండు సీతారామయ్య, అమ్మాజీ దంపతుల కుమారుడు రామ అప్పారావు జ్ఞాపకార్థం మున్సిపల్ స్టేడియంలో రాత్రి ఒంటిగంట నుంచి భారీ బాణసంచా హంగామా ఉంటుందన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, ఉపాధ్యక్షులు శీరంశెట్టి నరసింగరావు, కోశాధికారి వేల్పుల గణేష్ సహాయ కార్యదర్శి పనస శ్రీకాంత్, ముత్తా ఈశ్వరరావు, గుమ్మాల నాగేశ్వరరావు, గరికి గోపి, బొద్దపు ప్రసాద్, జనపరెడ్డి శ్రీరాములు, బాసూరు ఉమా మహేష్, గొర్లి శేఖర్ పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో ఆదివారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పర్యటించారు. సబ్బవరంలో ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాల అసోసియేషన్ నూతన డైరీని ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా జనసేన అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆవిష్కరించారు. విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు కె. జనార్ధన్, జనరల్ సెక్రటరీ రావర్తి కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ కళాశాలల అధినేతలు అడపా శేషగిరి, కె. నాగేశ్వరరావు, ఇ. గోవిందరావు , ఎం. మురళీ, పి.సత్యనారాయణ , ఆర్. రామ శేషు , కూటమి నేతలు తదితరులు తదితరులు పాల్గొన్నారు .

పేదలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి -అనకాపల్లి : సంక్రాంతి పండగ సందర్భంగా కన్యకా పరమేశ్వరి వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి వెల్ఫేర్ అసోసియేషన్, జానకిరామ చారిటబుల్ ట్రస్ట్, చిన్న వీధి రామాలయం సంయుక్తంగా పేదలకు 30 రకాల నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ వెలగా కాశీపతి, వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ తమ్మన లత, వైశ్య యువజన సంఘ ప్రెసిడెంట్ సూరే సతీష్, డాక్టర్ శేషు కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రెసిడెంట్ బిల్లపాటి కృష్ణ కుమార్, జానకి రామా చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ అగ్రేపు కామేష్, రాధికలను సత్కరించారు. కార్యక్రమంలో ఎల్‌బిఎస్ హరి, జివిఎస్, కేవీ, జంగాల శ్రీనివాస్, శ్రీధరాల హరి, గ్రంధి రాజేష్, తీగల సురేష్, దంగేటి రమేష్, తీగల పరమాత్మ, సిటీ కేబుల్ సతీష్,అగ్రేపు రాధ, అగ్రేపు భాగ్యలక్ష్మీ, అపరంజి, గ్రంధి సర్వ లక్ష్మి, తమ్మన మమత, గ్రంధి రాధ, బొగ్గరపు రాజు, దంగేటి మామాజీ, గుండా గుప్త, పల్లపోతుల పండు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ పరీక్షకు స్పందన

ప్రజాశక్తి -చోడవరం : స్థానిక ఏడమ్మ పాఠశాలలో పిఆర్‌టియు ఆధ్వర్యంలో నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు మంచి స్పందన వచ్చింది. సుమారు 250 మంది హాజరయ్యారు. వీరికి నమూనా ప్రశ్న పత్రాలు అందించి పరీక్ష నిర్వహించారు. పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను నిర్వాహకులు భద్రపరిచారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బి వెంకట్రావు, పిఆర్‌టియు మండల అధ్యక్షుడు ఎంవి స్వామి విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- కశింకోట : యువతకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం మండలంలోని తాళ్లపాలెం జంక్షన్‌లో డాక్టర్ గల్లా రాజు సొంత నిధులుతో ఏర్పాటుచేసిన అల్లూరి విగ్రహాన్ని ఎంపి సిఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టిటిడి బోర్డు డైరెక్టర్ జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర ఫైనాన్స్ అండ్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పీలా గోవింద సత్య నారాయణ, రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తులు తాతబ్బాయి, గ్రామ సర్పంచ్ రెల్లి నాగయమ్మ ఆవిష్కరించారు. కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, గొంతిని శ్రీను వాసరావు, కాయలు మురళి, వేగి గోపికృష్ణ, ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణ రావు, కలగా సోమేశ్వరరావు, బలిజ ముసిలి నాయుడు, కర్రి సత్య నారాయణ, కర్రి గోవింద పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి

-హోం మంత్రి వంగలపూడి అనిత - న్యాయంపూడి సర్పంచ్ వరహాలు బాబుతో పాటు పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- నక్కపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల కాలంలోనే ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని న్యాయంపూడి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. న్యాయంపూడి పంచాయతీ నీటి సమృద్ధి విభాగంలో జాతీయ స్థాయి పురస్కారం అందుకుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం పంచాయతీ అభివృద్ధికి సంబంధించి కోటి రూపాయలు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆమె పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పనులు కుంటు పడ్డాయన్నారు. పంచాయతీ నిధులు జమ కాగానే, వేరే వాటికి నిధులు మళ్లించి, అభివృద్ధి పనులను గాలికి వదిలేసారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ ఆరు నెలల కాలంలో మూడు వేల ఆరు వందల కోట్ల రూపాయలు నిధులతో రోడ్లు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే నియోజక వర్గంలో 50 కోట్ల రూపాయలతో రోడ్లు అభివృద్ధికి నిధులు కేటాయించామని తెలిపారు. రోడ్లు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, కూటమి ప్రభుత్వంలో ప్రధాని నరేంద్ర మోడీ విశాఖలో రెండు లక్షల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు వర్చువల్ గా శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ తో పాటు స్టీల్ ప్లాంట్ కూడా రాబోతుందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

సర్పంచ్ వరహాలు బాబు టిడిపిలో చేరిక

న్యాయంపూడి పంచాయతీ వైసిపి సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు తో పాటు పలువురు టిడిపిలో చేరారు. ఈ మేరకు అనిత వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వరహాలుతో మాట్లాడుతూ అనిత సారథ్యంలో గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వరహాలు బాబును పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనిత

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

-సిఐ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కొత్తకోట:సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో కోడి పందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తకోట సీఐ కోటేశ్వరరావు హెచ్చరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సంక్రాంతి పండుగను అందరూ సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో త్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ చేసిన ఆకతాయిలపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఊరు వెళ్తే సమీప పోలీస్ స్టేషన్లో సమాచారం ఇస్తే అటువంటి ఇల్లు పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. సంక్రాంతి సందర్భంగా తీసుకోవాల్సిన విధి విధానాలపై సర్కిల్ పరిధిలో కొత్తకోట, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్ల ఎస్సైలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గ్రామాలలో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని, ఇప్పటికే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గస్తీ ముమ్మరం చేశామన్నారు.





పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పాములవాక గ్రామంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు మండల వైసిపి అధ్యక్షులు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన పంచాయతీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రధాన రహదారి వద్ద బస్సు షెల్టర్ మరమ్మతు, అదేవిధంగా తుప్పల తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడంలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం రామారావు పేట లో ఆదివారం సంపత్ వినాయక దేవాలయం 35వ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులను స్పీకర్ అయ్యన్న పాత్రుడు సతీమణి పద్మావతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంక్రాంతి పండక్కి పేదవారు ఇబ్బంది పడకుండా ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో చేసిన ఈ కార్యక్రమంపై ఆలయ ధర్మకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా పేదవారు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.



సరుకులు ఇస్తున్న ధర్మకర్తలు

ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలు చదవాలి

- నర్సీపట్నం డిఎస్‌పి మోహన్

ప్రజాశక్తి-గొలుగొండ:యువత ప్రముఖుల జీవిత చరిత్రల గల పుస్తకాలను అధికంగా చదవాలని నర్సీపట్నం డీఎస్పీ మోహన్ సూచించారు. ఆదివారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయంకు నర్సీపట్నం డిఎస్పీ జి.మోహన్ డీఎస్పీ, పోలీస్ కానిస్టేబుల్, ఆర్ఆర్‌బి, ఏపిపిఎస్సీ గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు చదువుకునేందుకు 15వేల విలువ స్టడీ మెటీరియల్, రీడింగ్ చైర్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో ఏం జరుగుతుందో తెలియాలంటే ప్రతీ రోజు దినపత్రికలను చదవాలన్నారు. మంచి అలవాట్లు కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులకు కష్టం కలిగించకుండా, ఉపాధ్యాయుల గైడెన్స్‌తో ముందుకు వెళ్లాలన్నారు. సేవా కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలన్నారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన ఉండాలని సూచించారు. ఈ గ్రంథాలయానికి త్వరలో డిజిటల్ లైబ్రరీ, ఇంటర్ నెట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో పండుగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను డీఎస్పీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వై.తారకేశ్వరరావు, ఏఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డిఎస్‌పి



తిరువీధి సేవ నిర్వహిస్తున్న భక్తులు

గజ వాహనంపై వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలో ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పుష్ప తోటలో గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమంలో నిర్వహించి, తిరు వీధి సేవ నిర్వహించారు.శ్రీదేవి భూదేవి,సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను గజ వాహనంలోనూ, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను పెద్దపల్లికి లోను వేయింపచేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మన్యం గజ గజ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో గత వారం రోజుల నుంచి చలి తీవ్రత పెరిగింది. ఎముకలు కోరికే విధంగా చలి ఉంటుంది. రాత్రి నుంచి సుమారు ఉదయం 10 గంటల వరకు చలిమంచు వీడటం లేదు. దీంతో 10 గంటల సమయంలో కూడా వాహనదారులు లైట్లు వేసి పొగ మంచులో ప్రయాణం చేస్తున్నారు. ఉదయం 9 గంటలైనా చలిమంటలు వేసుకుని కాచుకుంటున్నారు. ఎముకలు కొరికి చలి తీవ్రతతో మండల గిరిజనులు బయటికి రావడానికి భయపడుతూ ఇంటికె పరిమితమవుతున్నారు. పెరిగిన చలి తీవ్రతకు స్థానికులు ఇబ్బందు పడుతున్నా మైదాన ప్రాంతం నుంచి తిలకించడానికి వచ్చిన సందర్శకులు మాత్రం చలిమంచును ఆస్వాదిస్తున్నారు.

అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయ ప్రాంతంలో రోజురోజుకు చలి తీవ్రత పెరిగి పోతుండడంతో ఉన్ని దుస్తులకు గిరాకి పెరిగింది. గతంలో ఎప్పుడు లేనంతగా జనవరి మాసంలో ఉష్ణోగ్రత తీవ్రంగా పడిపోతుండడంతో ఈ ప్రాంతంలో గిరిజనులు సతమతం అవుతున్నారు. చిన్నపిల్లల దగ్గర నుంచి పండు టాకుల వరకు గజగజ వణికి పోతున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఉన్నిదుస్తులను ఆశ్రయిస్తున్నారు. వీరితోపాటు పర్యాటకులు కూడా ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి చలి తీవ్రతను తట్టుకోలేక పర్యాటకులు వెను తిరుగుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు అయినా చలి తీవ్రత తగ్గక పోవడంతో ఇబ్బందులు పడక తప్పడం లేదు. దీంతోపాటు కొద్దిసేపు ఎండ కాసినప్పటికీ మరల మూడు గంటల సమయం నుంచి చలిగాలులు మొదలు కావడంతో ఈ ప్రాంతంలో గజగజ వణికి పోతున్నారు. గత వారం రోజులుగా చలి తీవ్రత సింగల్ డిజిట్ కి పడి పోయింది. ఉష్ణోగ్రత పడిపోతున్న దృష్ట్యా రగ్గులు, స్వెటర్లు విక్రయదారులు అరకులోయ ప్రాంతంలో చేరుకొని ఊరూరా తిరిగి విక్రయిస్తున్నారు. దీంతోపాటు ఒరిస్సాకు చెందిన వ్యాపారులు అరకు లోయలో ఉన్ని దుస్తుల దుకాణాలు రోడ్ల విరువైపులా పెట్టడంతో స్థానికులు పర్యాటకులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఉన్ని దుస్తులకు మరింత గిరాకీ ఏర్పడింది.

పర్యాటకులు మాత్రం ఈ చలిని ఆస్వాదిస్తున్నారు. ఫిబ్రవరి నెల వరకు చలి పెరుగుతూనే ఉంటుందని కొంతమంది పెద్దలు అభిప్రాయపడుతున్నారు. చలి తీవ్రత అధికంగా ఉండడంతో పాటు, పొగ మంచు కప్పుకొని ఉండడంతో వాహన చోధకులు ప్రయాణించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. అరకు- విశాఖ ఘాట్ రోడ్‌లో మరింతగా ఉష్ణోగ్రత పడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



డుంబ్రిగుడలో కురుస్తున్న మంచు



అమ్మకాలు చేపడుతున్న సిబ్బంది

సేంద్రియ ఆహార ఉత్పత్తుల అమ్మకాలు

ప్రజాశక్తి- మాడుగుల:సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ప్రకృతి వ్యవసాయం విధానంలో సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులను అమ్మకాలు చేపడుతున్నామని సేంద్రియ వ్యవసాయ మండలం ఇంచార్జ్ గండి శ్రీను అన్నారు. ఆదివారం మాడుగుల శ్రీదేవి అమ్మవారి ఆలయం ఎదురుగా గ్రామస్తులు సహకారంతో ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించిన ఆకుకూరలు, కూరగాయలను, దుంప జాతి, పండ్ల జాతి ఉత్పత్తులను, చిరుధాన్యాలను అన్ని రకాల పంటను విత్తనాలను, కషాయాల అమ్మకాలు చేపట్టారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలతో ప్రజలకు మరింత ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పండించిన ఉత్పత్తుల అమ్మకాలను స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకం చేయడంతో పాటు వాటితో కలిగే ప్రయోజనాలు లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం.టీ దేవి, కొండాజీ, యూనిట్ ఇంచార్జ్ పార్వతి, నాగేశ్వరావు, సన్యాసిరావు, చిరంజీవి నాయుడు ఐసిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి మండలంలో క్రిష్ టౌన్ షిప్‌లో హెూం మంత్రి వంగలపూడి అనిత ఆద్వర్యంలో ఈ నెల 13 సోమవారం ఉదయం భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు ప్రారంభం కానున్నాయని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆ రోజు ఉదయం 9 గంటలకు నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు జరగనున్నాయని, విజేతలకు మొదటి బహుమతి గా 20 వేలు, ద్వితీయ బహుమతి 15 వేలు, తృతీయ బహుమతి 10 వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ముగ్గుల పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొవాలని పిలుపునిచ్చారు. కోలాటాలు, తప్పుడుగుళ్ళు కళాకారుల ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు నిర్వహించను న్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, యస్ రాయవరం మండల పార్టీ అధ్యక్షులు అమలం కంటి అబద్ధం,కోటఉరట్ల మండలపార్టీ అధ్యక్షులు జానకి శ్రీను,పాయకరావుపేట నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షరాలు రమాకుమారి, నాయకులు కొప్పిశెట్టి బుజ్జి,గుర్రం రామకష్ణ, గోసల శ్రీకాంత్, వైబోయిన రమణ, వెలగా శ్రీను, సిహెచ్ పద్దు, శ్రీను పాల్గొన్నారు.



ఇసుక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహాశీల్దార్

ఇసుక తవ్వకాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి కోటవురట్ల:కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత అభివృద్ధి పనులకు గృహ నిర్మాణ అవసరాల నిమిత్తం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక తవ్వకాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసిల్దారు తిరుమల బాబు తెలిపారు.స్థానిక ఎస్సై రమేష్ నీటిపారుదల శాఖ ఇంజనీరు రాజేష్ తో కలిసి పందూరు, గొట్టువాడ గ్రామాలలో వరాహ నది పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని, వాల్టా చట్టానికి తూట్లు పొడిచే విధంగా తవ్వకాలు చేపట్టరాదన్నారు. వంతెనలు, వాటర్ ట్యాంకుల సమీపంలో తవ్వకాలు చేపట్టరాదని స్థానిక అధికారులకు సూచించినట్లు తెలిపారు. జెసిబి సహాయంతో లోడింగ్ చేయడం, మూడు అడుగులకు మించి తవ్వకాలు చేపట్టడం నిషేధమని తెలిపారు.



లైటును ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రీషియన్

వీధి లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లను ఆదివారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ పత్తి రమణ మాట్లాడుతూ..గ్రామంలో విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరమ్మత్తులకు గురైన వాటి స్థానంలో కూడా నూతన వీధి లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.

తిరుపతి ఘటనలో..

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

-స్పీకర్ అయ్యన్న, టిటిడి పాలక మండలి సభ్యులు నెహ్రూ, పనబాక లక్ష్మి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :తిరుపతి దుర్ఘటనలో మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ హామీ ఇచ్చారు. ఈ ఘటనలో మృతి చెందిన నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డపల్లికి చెందిన నాయుడుబాబు కుటుంబాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడితో పాటు టిటిడి పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో పరామర్శించారు. నాయుడు బాబు చిత్రపటానికి నివాళు లర్పించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 25 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, ఈ ఘటనలో మృతి చెందిన కుటుంబ సభ్యుల్లో అర్హులుంటే కాంట్రాక్ట్ ఉద్యోగం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పాటు బాధిత కుటుంబంలో చదువుకునే పిల్లలుంటే టీటీడీ ఆర్థిక సాయంతో చదివించేందుకు పాలకమండలి నిర్ణయించినట్టు నెహ్రూ చెప్పారు. వీరితో పాటు ఘటనలో క్షతగాత్రులైన వారికి ఎక్కువగాయాలైన వారికి రూ. 5 లక్షలు, స్వల్ప గాయాలతో బయటపడ్డ వారికి రూ. 2 లక్షలు చొప్పున పరిహారం అందజేసినట్టు ఆయన వివరించారు. ఈ విధంగా మొత్తం 21 మందికి చెక్కుల పంపిణీ చేశామన్నారు. కర్ణాటక, తమిళనాడుకు రాష్ట్రాల బాధిత కుటుంబాలకు సైతం పాలకమండలి ఆధ్వర్యంలో పరిహారం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. గతంలో ఎన్నడూలేని విధంగా దురదృష్టవశాత్తూ ఘటన జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారంతో పాటు పాలకమండలి సభ్యులు రాజు రూ. 50వేలు, కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రూ. 2 లక్షల సాయాన్ని బాధిత కుటుంబాలందరికీ అందజేయనున్నట్టు చెప్పారు.
స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మృతుడు నాయుడుబాబు తమ కుటుంబ సభ్యునిగా కలిసి ఉండేవారన్నారు. పార్టీతో పాటు స్వంత కార్యక్రమాల్లో పాలు పంచుకునేవారని పేర్కొన్నారు. నాయుడుబాబు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ పరిహారంతో పాటు టీడీపి సభ్యుడైన నాయుడుబాబుకు పార్టీ నుంచి మరో ఐదు లక్షల నష్టపరిహారం అందజేయనున్నట్టు అయ్యన్న వివరించారు.
టీటీడీ పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి మాట్లాడుతూ, పాలకమండలితో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కుటుంబాలను తగిన రీతిలో ఆదుకుంటాయని హామీ చ్చారు. భవిషత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్య బాబు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్ చింతకాయల రాజేష్, జనసేన నాయకులు రాజానవీరసూర్య చంద్ర పాల్గొన్నారు.



చెక్కును ఇస్తున్న స్పీకర్ అయ్యన్న, పాలక మండలి సభ్యులు

వైభవంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని పాలవలస పంచాయతీలో ఉన్న ఎక్యుజె కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి విజేతలకు రూ.1000ను గ్రామ వైస్ ప్రెసిడెంట్ నిమ్మల అప్పలరాజు ద్వారా అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుధారాణి, ఎన్ఎస్ఎస్ పిఒ పవన్‌కుమార్, ఎంసిఎ విభాగం హెచ్ఒడి డి.గంగరాజు, నాయకులు పాల్గొన్నారు.
మండలంలోని శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శంభుప్రసాద్, కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి, సెక్రటరీ ప్రసాదరాజు, డాక్టర్ పిసుబ్బరాజు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విజేతలు

పెందుర్తి : నరవ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో ముగ్గులు, ప్రాచీన వంటకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతమ్మధార : సీతమ్మపేట హరిజన వీధిలో గాంధీ హరిజన సేవా సంఘం యువత ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 120 మంది మహిళలు పోటీలో పాల్గొన్నారు. విజేతలకు ప్రముఖ వ్యాపారవేత్తలు పోలంక సత్యనారాయణ, భీమవరపు శ్రీనివాసరావు, 25వ వార్డు వైసిపి అధ్యక్షులు బోగవల్లి గోవింద్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గంట్యాడ ఆదినారాయణ, గుమ్మడి గోపి, మంచిపిల్లి లక్ష్మణరావు, జామి శివ తదితరులు పాల్గొన్నారు

ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు

విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి సందర్భంగా జివిఎంసి 28వ వార్డు పంది మెట్టలో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఐద్వా నాయకులు కె.మణి, బి.సత్యవతి, గౌరీ నిర్వహణలో ఈ పోటీలు సాగాయి. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పి.వరలక్ష్మి, ద్వితీయ బహుమతి పి.హేమలత, తృతీయ బహుమతి జయ మౌనిక, నాలుగో బహుమతి నవ్యకు లభించాయి. విజేతలకు మహిళా సంఘం ఇచ్చిన బహుమతులతో పాటు సాయి పుట్టినరోజు సందర్భంగా మొదటి బహుమతిగా రూ.400, రెండో బహుమతిగా రూ.300, మూడో బహుమతిగా రూ.200తో పాటు పాల్గొన్న వారందరికీ వంద రూపాయలు చొప్పున అందించారు. భోగి మంటలో అధిక విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, శివ పాల్గొన్నారు.



ముగ్గు వేస్తున్న మహిళ

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ:స్తానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంను గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులచే బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. గ్రంథాలయాధికారి రాజుబాబు విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్రను వివరించారు.



వివేకానందునికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

హోంమంత్రి పర్యటనలో అపశృతి

- బాణసంచా పేలడంతో బాలుని చేతికి గాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని న్యాయంపూడిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం చేపట్టిన రోడ్డు ప్రారంభోత్సవంలో ఆదివారం సాయంత్రం హెూంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బాణాసంచా పేల్చారు. అదే ప్రాంతంలో ఆడుకుంటూ ఉన్న బాలుడు అరుగుల సాత్విక్ (8) పేలని బాంబు కనిపించడంతో తీశాడు. ఒక్కసారిగా బాంబు పేలడంతో బాలుడు చేతికి తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. గాయపడ్డ బాలుడును హుటా హుటిన స్థానిక 50 పడకల ఆసుపత్రి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట జెడ్పీహెచ్ స్కూల్ మైదానంలో సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం క్రికెట్ టోర్నమెంట్‌ను నర్సీపట్నం డీఎస్పీ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో ఇటువంటి క్రీడలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. పండగలో అసాంఘిక కార్యక్రమాల్లో యువత పాల్గొనరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తారకేశ్వరరావు, సర్పంచ్ లోచల సుజాత, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న డిఎస్పి మోహన్